క్లుప్తంగా

బ్రిడ్జి నిర్మాణానికి భూ సేకరణ వేగవంతం

కాకినాడ ఆర్డీఓ సత్యనారాయణ



రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పిఠాపురం: పిఠాపురం–ఉప్పాడ రైల్వే గేటు వద్ద నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణ చేపట్టినట్టు కాకినాడ ఆర్డీఓ ఎన్వీవీ సత్యనారాయణ తెలిపారు. రైల్వే, ఆర్ అండ్‌బీ అధికారులతో కలిసి గురువారం ఆయన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నామన్నారు. దీని నిర్మాణానికి 6.70 ఎకరాల భూమి అవసరమన్నారు. దీని కోసం ఇప్పటికే అవసరమైన భూమిని గుర్తించి, భూసేకరణ చేపట్టినట్టు ఆయన తెలిపారు. భూ సేకరణ, బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఆర్అండ్‌బీ డీఈ అశ్రిత, తహసీల్దార్ త్రినాథ్‌రావు, సర్వేయర్ సత్యనారాయణ, రైల్వే అధికారులు ఉన్నారు.

తాటిపర్తిలో జెండా రాజకీయం



తాటిపర్తిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన జెండా దిమ్మెలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో జెండాల రాజకీయం నెలకొంది. జనసేన, ప్రజాశాంతి పార్టీల కార్యకర్తలు జెండా దిమ్మెల నిర్మాణాలతో నరకం చూపిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇటీవల జనసేన పార్టీ నాయకులు తాటిపర్తి నుంచి చినజగ్గంపేట వెళ్లే దారిలో నడిరోడ్డుపై జెండా దిమ్మెను నిర్మించారు. దానికి తాము ఏమి తీసిపోమని ప్రజాశాంతి పార్టీ పేరుతో మరో వర్గం దాని పక్కనే మరో జెండా దిమ్మె నిర్మించింది. ఈ రెండు దిమ్మెలకు పంచాయతీ అనుమతి లేకపోగా దారికి అడ్డంగా నిర్మించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీరు వృథా



పెద్దాపురం మున్సిపాలిటీ ఎయిర్ వాల్వు లీకుతో వృథాగా పోతున్న తాగునీరు

సామర్లకోట: పెద్దాపురం మున్సిపాలిటీకి చెందిన పైపులైన్ ఎయిర్‌వాల్వ్ లీకు కావడంతో తాగునీరు వృథాగా పోతోంది. సామర్లకోట–కాకినాడ రోడ్డులో ఉన్న సాంబమూర్తి రిజర్వాయర్ ద్వారా గోదావరి జలాలను శుద్ధి చేసి పైపులైన్ ద్వారా బ్రౌన్‌పేట నుంచి పెద్దాపురం వాటర్ ట్యాంకులకు వెళ్తుంది. స్థానిక నవదుర్గ ఆలయం వద్ద ఉన్న ఎయిర్ వాల్వ్ లీకు రావడంతో లక్షాలాది లీటర్ల తాగునీరు వృథాగా పోతోంది. దాంతో ఆయా రహదారులు చెరువులుగా మారి పోయాయి. దీనిని పెద్దాపురం ఏఈ కె.ఆదినారాయణ దృష్టికి తీసుకువెళ్లగా సమస్య తన దృష్టికి రాలేదని వెంటనే పరిష్కరిస్తామన్నారు.

వైభవంగా రాఘవేంద్రస్వామి ఆరాధన

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని ఉన్న రాఘవేంద్రస్వామి బృందావన సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి 352 ఆరాధన మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సమితి కోశాధికారి వై.వెంకటేష్ మాట్లాడుతూ మూడు రోజులు పాటు ఈ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం రాఘవేంద్రస్వామి బృందావనానికి విశేష అలంకరణ జరుగుతుందన్నారు. బ్రాహ్మణులను నూతన వస్త్రాలతో సత్కరించనున్నట్టు తెలిపారు.

ఓటర్ల జాబితా పరిశీలన

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామంలోని పాత గైగోలుపాడులో 62వ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటర్ల జాబితాను కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీఓ ఎన్వీవీ సత్యనారాయణ గురువారం పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి జాబితాలోని ఓటర్లను పరిశీలించారు. ఓట్ల తొలగింపునకు గల కారణాలు తెలుసుకున్నారు. కొన్ని చోట్ల మరణాలు, డబుల్ ఎంట్రీ, మరణాలు వలన తొలగించినట్టు బూత్ స్థాయి అధికారులు ఆయనకు వివరించారు. అలాగే పర్మినెంట్ మైగ్రేషన్ వివరాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురార్జీ, డీటీలు వై.శ్రీనివాస్, కె.సురేష్, వీర్వోలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీపౌర్ణమి వేడుకలు

- దత్తాత్రేయస్వామికి రాఖీలు కట్టిన భక్తులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పిఠాపురం: ఈ ఏడాది రాఖీ పౌర్ణమి వేడుకలు రెండు రోజులు నిర్వహించగా రెండో రోజు గురువారం పాదగయ క్షేత్రం, శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానాల్లో ఘనంగా నిర్వహించారు. శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో స్వామివారిని ఎమ్మెల్యే పెండెం దొరబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేయగా ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డెం జనార్ధనరావు స్వామివారి ప్రసాదాలు అందజేశారు. పాదగయ క్షేత్రంలో దత్తాత్రేయస్వామికి పలువురు భక్తులు రాఖీలు కట్టి తమ భక్తిని చాటుకున్నారు. దత్తాత్రేయుడిని తమ సోదరుడిగా భావించి ఆయనకు రాఖీలు కట్టారు. భారీగా తరలివచ్చిన మహారాష్ట్ర భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. పాదగయ క్షేత్రం, శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానాల్లో దత్తాత్రేయునికి, శ్రీపాదవల్లభ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు, హోమాలు ఘనంగా నిర్వహించారు. సుమారు 50 వేల మంది భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.

ఎమ్మెల్యేకు రాఖీలు కట్టిన మహిళలు

రాఖీ పండగ సందర్భంగా పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు పలువురు మహిళలు రాఖీలు కట్టారు. గురువారం దుర్గాడలో పర్యటించిన ఎమ్మెల్యే దొరబాబుకు ఆ గ్రామ మహిళలు రాఖీలు కట్టి ఆశీర్వాదం పొందారు.



శ్రీపాదశ్రీవల్లభ సంస్థానంలో పూజలకు హాజరైన మహారాష్ట్ర భక్తులు

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

పెద్దాపురం: అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని తెలియజేసే రక్షా బంధన్ (రాఖీ) పర్వదినాన్ని పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో గురువారం ఘనంగా జరుపుకొన్నారు. సోదర ప్రేమను తెలియజేస్తూ కుటుంబ సభ్యులతో చిన్నారులు ఆనందంగా గడిపారు. దూర ప్రాంతాల్లో ఉన్న అన్న కోసం ఎదురుచూసిన వాళ్ళు కొంతమంది, చెల్లెళ్ల కోసం రాకీ కట్టించుకునేందుకు వెళ్లిన అన్నలతో కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొంది. పిన్న, పెద్దా తారతమ్యం లేకుండా నాటి సాంప్రదాయాన్ని గౌరవిస్తూ రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు.



ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు రాఖీ కడుతున్న యువతి

మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపాల్ రాయవరపు సత్య రాఖీలు కట్టించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో..

సామర్లకోట: పట్టణ పరిధిలో అనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులు విద్యార్థులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు సైతం రాఖీ పండగను జరుపుకొన్నారు.



దత్తాత్రేయ స్వామికి రాఖీలు కడుతున్న భక్తులు



శ్రీపాదశ్రీవల్లభస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



పాదగయ క్షేత్రంలో స్వామివారికి రాఖీ కడుతున్న భక్తురాలు



రాఖీ కట్టుకుంటున్న విభిన్న ప్రతిభావంతుల చిన్నారులు

ప్రజా సంక్షేమమే ధ్యేయం



దుర్గాడలో మహిళకు ప్రభుత్వ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- దుర్గాడలో గడపగడపకూ మన ప్రభుత్వం

పిఠాపురం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి అందుతున్న పథకాలను చదివి వినిపించారు. అన్ని పథకాలు సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకూ ఏ ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేశారన్నారు. గత టీడీపీ హయాంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఒక్క పథకం కూడా అందకుండా వివక్షత చూపించారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం పార్టీలకు అతీతంగా పథకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. టీడీపీ నేతలకు సైతం పథకాలు ఇస్తున్నామని, వివక్షత అనేది ఎక్కడా లేకుండా పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులను స్వీకరించి వాటి పరిష్కారానికి వెంటనే తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. తొలుత రాఖీ పౌర్ణమి సందర్భంగా స్థానిక మహిళలు ఎమ్మెల్యేకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల శ్రీనివాసు, శివకోటి అప్పలకొండ, వెలుగుల సత్యనారాయణ, వైస్ సర్పంచ్ పంపన సూర్యచంద్రరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

మామిళ్లదొడ్డికి మార్గం సుగమం

- 20 ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం
- రూ.18 లక్షలతో వంతెన నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామ ప్రజలు

సామర్లకోట: మండల పరిధిలో ఉండూరు శివారు ప్రాంతమైన మామిళ్లదొడ్డి ఏర్పడినప్పటి నుంచి ఆ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారమైంది. ఉండూరు పంచాయతీలో సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో, వీకే రాయపురం పంచాయతీకి సమీపంలో ఈ గ్రామం ఉంది. ఈ గ్రామానికి చేరాలంటే 20 ఏళ్లుగా తాటి దుంగల సాయంతో గోదావరి దాటి ఆవలికి చేరాలి. వృద్ధులు, చిన్నారులు, చిన్న వాహన చోదకులు వీకే రాయపురం మీదుగా సామర్లకోట–కాకినాడ ప్రధాన రోడ్డుకు చేరుకుని ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఈ ప్రాంతంలో వంతెన ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎంగా ఉన్న కాలంలో రాజప్ప దృష్టికి తీసుకు వెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాంతంలో పర్యటించిన రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు సమస్యను పరిశీలించి జెడ్పీ నిధులు రూ.18 లక్షలు మంజూరు చేయించి నిర్మాణాన్ని పూర్తి చేయించారు. మోటారు సైకిళ్లతో పాటు ఆటోల రాక పోకలు జరిగేలా కాలిబాట వంతెన నిర్మించడంతో ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రారంభోత్సవానికి ఎదురు చూస్తున్న కాలిబాట వంతెన

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



సామర్లకోటలోని బాలాత్రిపుర సుందరీ సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో మూడో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వ్రతాలు చేసుకునే మహిళలు విఘ్నేశ్వర పూజలకు కేజీ 1/4 బియ్యం, పంచపాత్ర ఉద్ధరిణి, కలశపాత్ర, జాకెట్టు ముక్క తీసుకురావలసి ఉంటుంది. మిగిలిన సామగ్రి తమలపాకులు, పువ్వులు, తోరాలు, వరలక్ష్మీ రూపు, లక్ష్మీదేవి ఫొటో, ప్లేటు, గాజులు దాతల సహకారంతోను, ప్రసాదం దేవస్థానం తరపున ఏర్పాటు చేస్తున్నారు. వరలక్ష్మీ వ్రతాలు చేసుకునే మహిళలు ఉదయం 9.15 నిమిషాలకు ఆలయానికి చేరుకోవాలని ఈఓ వి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు తెలిపారు.

ఘనంగా శ్రావణ పౌర్ణమి పూజలు

కరప: శ్రావణ పౌర్ణమి సందర్భంగా గురువారం మండలంలోని పలు బాబా ఆలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. గురజనాపల్లిలో ఆలయ వ్యవస్థాపకులు కర్నాసుల శివకుమార్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అలాగే పలు గ్రామాల్లో జంధ్యాల పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణులు, వైశ్యులు, రాజులు తదితర సామాజిక వర్గీయులు లక్ష్మీదేవి వద్ద జంధ్యాలను ఉంచి నియమ, నిష్టలతో ప్రత్యేక పూజలు చేసి జంధ్యాలను మార్చుకున్నారు. మహిళలు దుర్గాదేవికి పూజలు చేశారు.

నాలుగు వేల ఎకరాల్లో ఈ–క్రాప్ నమోదు

కొత్తపల్లి: మండలంలో ఇప్పటివరకూ నాలుగు వేల ఎకరాల్లో ఈ–క్రాప్ నమోదు చేసినట్టు మండల వ్యవసాయాధికారి జోగిరాజు తెలిపారు. కొత్తపల్లిలో ఈ–క్రాప్ నమోదును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతూ తప్పని సరిగా ఈ నెల 15వ తేదీ లోగా ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాలతో పాటు కామన్ సర్వీస్ సెంటర్లలో ఈ–క్రాప్, ఈ–కేవైసీ చేయించుకోవచ్చన్నారు. రైతులు, కౌలు రైతులు అధికారులకు సహకరించి తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.



కొత్తపల్లిలో ఈ–క్రాప్ నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి జోగిరాజు

ఎదురెదురుగా టిప్పర్ల ఢీ

త్రుటిలో తప్పిన ప్రమాదం

సామర్లకోట: స్థానిక పెద్దాపురం ఏడీబీ రోడ్డులో ఎదురెదురుగా రెండు టిప్పర్లు గురువారం సాయంత్రం ఢీ కొన్నాయి. దాంతో ఆ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మణికంఠ టైల్స్ షాపు వద్ద పెద్దాపురం నుంచి సామర్లకోట వస్తున్న టిప్పరు, సామర్లకోట నుంచి పెద్దాపురం వైపు వెళ్తున్న టిప్పర్ ఢీ కొన్నాయి. అయితే ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం సంబవించలేదు. సాయంత్రం కావడంతో వివిధ కార్పొరేట్ కళాశాలల నుంచి వచ్చే బస్సులతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, ఏఎస్సై రత్నం, ట్రాఫిక్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా ప్రదేశానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



సామర్లకోట–పెద్దాపురం రోడ్డులో ఢీ కొన్న టిప్పర్లు

వైభవంగా సుదర్శన, మహాచండీ హోమాలు

తుని రూరల్: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం లోవ దేవస్థానంలో మహాచండీ హోమం, ఎస్.అన్నవరంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. తలుపులమ్మతల్లికి ప్రీతికరమైన మహాచండీ హోమాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎస్.అన్నవరంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సుదర్శన మూర్తి ప్రతిమను ఆలయం చుట్టూ ఊరేగించి అర్చకులు వైభవోపేతంగా సుదర్శన హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలను నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.



ఎస్.అన్నవరంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న పండితులు

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అమ్మవారి కుంకుమార్చనలు చేశారు. అలాగే ఆలయంలో వేంచేసి ఉన్న ఉప ఆలయాల్లో స్వామి వార్లు, అమ్మవార్లకు పూజలు చేశారు. ఈఓ డి.నాగ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా ట్రస్టు బోర్డు సభ్యులు భక్తులకు సేవలందించారు. పూజల అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.

భక్తి శ్రద్ధలతో మాండవ్య నారాయణుని గ్రామోత్సవం



సామర్లకోటలో సాగుతున్న గ్రామోత్సవం

సామర్లకోట: శ్రావణ మాసం, పౌర్ణమిని పురస్కరించుకుని అతి పురాతన విష్ణు ఆలయమైన మాండవ్య నారాయణస్వామి ఆలయంలో స్వామి వారి గ్రామోత్సవం గురువారం భక్తి శ్రద్ధలతో ప్రారంభమైంది. ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి స్టేషన్ సెంటర్, గాంధీచౌక్, చిన్న వీధి, పెద్దవీధి, యార్లగడ్డవారి వీధి, మఠం సెంటర్, కోత్తూరు మీదుగా గ్రామోత్సవం ఆలయానికి చేరింది. ఇళ్ల వద్దకు వచ్చిన స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి: చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక పోలీసులు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని రమణక్కపేట గ్రామాని చెందిన బొడ్డు చినబాబు (49) కాలుకు మేకు గుచ్చుకుంది. చికిత్స నిమిత్తం తన అల్లుడు మెరుగు లక్ష్మణరావు మోటార్ సైకిల్‌పై బుధవారం నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకు వెళ్తుండగా మార్గం మధ్యలో ప్రమాదశాత్తూ కింద పడ్డడు. తీవ్రంగా గాయపడిన చినబాబును చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. దీనిపై మృతుడి కుమారుడు మోసేరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రాలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్‌తోనే సంక్షేమ పాలన



గడపగపడకు మన ప్రభుత్వంలో ప్రజల సమస్యలు వింటున్న దొరబాబు

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం : ప్రజా సంక్షేమ పాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. గురువారం పెద్దాపురం ఒకటో సచివాలయం 1, 2 వార్డుల పరిధిలో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఆ వార్డు కౌన్సిలర్లు ఆరెళ్లి వీర్రాఘవులు, ఆకుల కృష్ణబాపూజీ, సచివాలయ సిబ్బందితో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వనదుర్గ అమ్మవారి జాతర



గాయత్రీదేవి అలంకరణలో వనదుర్గ అమ్మవారు

అన్నవరం: రత్నగిరిపై ఆరు రోజులుగా నిర్వహిస్తున్న వనదుర్గ అమ్మవారి శ్రావణ మాస జాతర మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు వనదుర్గ అమ్మవారు ఐదు శిరస్సులతో గాయత్రీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యంగిర, చండీహోమాలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పండితులు అమ్మవారికి నవగ్రహజపాలు, శ్రీచక్రార్చన, పురుష, శ్రీసూక్త పారాయణలు, మూలమంత్ర జపాలు, సూర్యనమస్కారాలు, సప్తశతీ పారాయణలు, బాల, కన్య, సువాసిని పూజలు నిర్వహించారు. అనంతరం చండీ, ప్రత్యంగిర హోమాలు ప్రారంభించారు. 11 గంటలకు ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పాల్గొన్నారు.

నేడు వనదుర్గ అమ్మవారికి చండీహోమం

శ్రావణ శుక్రవారం సందర్భంగా వనదుర్గ అమ్మవారికి ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు చండీహోమం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఆసక్తి గల భక్తులు రూ.558తో టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొనవచ్చన్నారు.

ఉప్పాలమ్మతల్లికి సామూహిక కుంకుమ పూజలు

- 108 కలశాలతో ముత్తయిదువుల ఊరేగింపు
- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కురసాల

కరప: గ్రామ దేవత ఉప్పాలమ్మ తల్లి ఆలయంలో గురువారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ముందుగా దుర్గాదేవి ఆలయం నుంచి 108 మంది ముత్తైదువులు కలశాలను తలపై పెట్టుకుని ఆలయం వరకు బాణసంచా కాల్పులతో, గరగన్నృత్యాలతో తప్పెటగుళ్లతో ఊరేగింపుగా వెళ్లి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, కలశాలను అమ్మవారికి సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ అమ్మవారి ఫోటో, రూపు, పూజాసామాగ్రి అందజేయగా, సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. కన్నబాబు, శ్రీవిద్య దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సీహెచ్ మురళీకృష్ణతో పాటు జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.



కరపలో 108 కలశాలతో ఊరేగుతున్న మహిళలు